

స్వామి వారిని దర్శించుకొనేందుకు కొండపైకి వెళ్లే మెట్లదారి

కోరిన కోర్కెలు తీర్చే కోర మీసాల రాముడు

- అపర భద్రాద్రిగా ప్రఖ్యాతిగాంచిన సిరసనగండ్ల
- నేటి నుంచి 11వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు

7



జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువ వద్ద పోలీస్ అవుట్ పోస్టు భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న డీజీపీ, ఎమ్మెల్యే తదితరులు

అదుపులో శాంతి భద్రతలు

- సీసీ కెమెరాలు ఏర్పాటులో దేశంలోనే తెలంగాణ టాప్
- రాష్ట్రంలో సగానికి పైగా నేరాలు తగ్గుముఖం
- డీజీపీ డాక్టర్ జితేందర్

6



బియ్యపు గింజపై శ్రీరామ నామాన్ని రాస్తున్న చక్రవర్తి

శ్రీరామ నామం మోక్షప్రదం

- బియ్యపు గింజలపై శ్రీరామ నామం

7

ప్రజలు ధనవంతులుగా ఎదగాలి

- ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ఎవరికీ లంచం ఇవ్వొద్దు

● వివరాలు 6లో..

సన్నాలకు సై

- గత సీజన్‌లో 70 శాతానికి పైగా సన్న రకాలనే విక్రయించిన రైతులు
- దొడ్డు రకాల నుంచి మళ్లింపు
- క్వింటాలుకు రూ.500 బోనస్‌తో మళ్లీ ప్రాధాన్యం..
- రూ.270 కోట్ల లబ్ధి
- ఇప్పుడు పీడీఎస్ కింద సన్నాలే పంపిణీ
- అటు రైతుకు, ఇటు ప్రజలకు లబ్ధి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం సన్నాలకు ఇస్తున్న బోనస్ రైతులకు వరంగా మారుతోంది. మూస పద్ధతిలో దొడ్డు రకాలు సాగు చేస్తున్న రైతులు క్రమంగా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న సన్న రకాల వైపు అడుగులు వేస్తున్నారు. గత సీజన్‌లో ప్రభుత్వ కొనుగోళ్లను ఇందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. సన్నాలను ప్రోత్సహించడం అటు రైతులకు ఒకరకంగా మేలు చేస్తుండగా.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా వాటిని సేకరించడం వల్ల ఆహార భద్రత పథకం కింద ప్రజలకు రేషన్ ద్వారా ఇవ్వడానికి ఆస్కారం ఏర్పడింది. తద్వారా పీడీఎస్ బియ్యం దుర్వినియోగానికి కూడా అడ్డుకట్ట పడనుంది. అలాగే రీసైక్లింగ్ కింద మిల్లర్లు రేషన్ బియ్యం సేకరించడం కూడా తగ్గిపోతుందనే అభిప్రాయం ఏర్పడుతోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నీటి వనరుల లభ్యత పెరిగిన తర్వాత వరిసాగు గణనీయంగా వృద్ధి చెందింది. ప్రత్యామ్నాయ పంటలను కూడా వదులుకుని రైతులు సులభంగా పూర్తయ్యే, మార్కెటింగ్‌కు ఇబ్బంది లేని వరివైపు మొగ్గుచూపుతున్నారు. పండించిన ధాన్యం మెజారిటీ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయిస్తున్నారు. దాంతో ధాన్యం సామర్థ్యం కంటే ఎక్కువగా మిల్లులకు కేటాయిస్తున్నారు. ఈ క్రమంలో అక్రమాలు జరుగుతున్నాయి. అలాగే దొడ్డు రకాల నిల్వలు పెరిగిపోతుండటం, కేంద్రం సన్న రకాల ధాన్యాన్ని ఎఫ్‌సీఐ ద్వారా తీసుకోడానికి మాత్రమే అంగీకరిస్తుంటంతో ప్రభుత్వం సన్న రకాలకు బోనస్‌ను ప్రకటించింది. ఈ విధానం వల్ల రైతులు భవిష్యత్‌లోనూ సన్న రకాలను ఎక్కువగా సాగుచేసే అవకాశాలు ఉంటాయని చెప్పొచ్చు.

70 శాతం సన్నాలే సేకరణ..

దొడ్డు రకాలతో పోల్చితే సన్న రకాల వరి పంట కాలం ఎక్కువ. అలాగే నీటి అవసరం కూడా ఎక్కువ. దిగుబడి కూడా తక్కువ వస్తుంది. ఈ నష్టాలను భర్తీ చేసుకునేందుకు రైతులంతా దొడ్డు రకాలవైపు మొగ్గు చూపారు. అలాగే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో దొడ్డు రకాలకు, సన్న రకాలకు ఒకే ధర చెల్లిస్తుండటం, మార్కెట్‌లో సన్న బియ్యానికి అధికంగా ధర ఉన్నా.. గత్యంతరం లేక ఆ ధాన్యాన్ని తక్కువకే విక్రయించుకోవాల్సిన దుస్థితి ఉండేది. ఇదే కారణంతో సన్నాలను పూర్తిగా నిలిపివేసి.. దొడ్డు రకాల వైపు రైతులు ఆసక్తి చూపారు. అయితే మధ్యలో ప్రభుత్వం సన్నాలే సాగుచేయాలనే నిబంధన ఒక సీజన్‌లో పెట్టింది. కానీ వర్షాల కారణంగా సన్నాల దిగుబడి రాలేదు. ఇక దొడ్డు రకాలు అనివార్యమయ్యాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత ఏడాది ప్రభుత్వం సేకరించిన ధాన్యం			
జిల్లా	మొత్తం ధాన్యం (టన్నుల్లో)	సన్నరకం (టన్నుల్లో)	బోనస్ (రూ.కోట్లలో)
మహబూబ్‌నగర్	91,885	62,596	31.29
నాగర్‌కర్నూలు	99,959	63,914	31.95
జోగులాంబ గద్వాల	67,871	67,721	33.86
వనపర్తి	2,22,564	1,35,438	67.71
నారాయణపేట	89,943	71,765	35.88
మొత్తం	5,72,222	4,01,434	270.98



వనపర్తి సమీపంలో చిట్యాల వద్ద గల మార్కెట్ యార్డులో ధాన్యం కాంటా చేస్తున్న నిర్వాహకులు(ఫైల్)

ఇప్పుడు ప్రభుత్వం సన్న రకాలకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పడంతో తక్కువ దిగుబడి వచ్చినా నష్టాన్ని భర్తీ చేసుకోవచ్చని రైతులు ఆసక్తి చూపుతున్నారు. గత వానాకాలం సీజన్‌లో దొడ్డు రకాలను కర్ణాటకకు చెందిన వ్యాపారులు కల్లాల వద్దే కొనుగోలు చేసి తీసుకెళ్లారు. సన్నాలను మాత్రం రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే మెజారిటీగా విక్రయించారు. బోనస్ చెల్లింపులో కొంత ఆలస్యం జరిగినప్పటికీ.. ఉమ్మడి జిల్లాలో (మిగతా 6లో..)

మామిడి రైతు విలవిల

- 150 ఎకరాలలో రాలిన కాయలు
- నేలకొరిగిన బొప్పాయి చెట్లు
- కల్లాల్లోనే తడిసి ముద్దయిన మిరప

● వివరాలు 6లో..



గద్వాల మండలం కొండపల్లిలో నేలకొరిగిన బొప్పాయి చెట్లను పరిశీలిస్తున్న హార్టికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్

న్యూ ఎంట్రీ

- కొత్త ఓటర్ల నమోదుకు ప్రారంభమైన ప్రక్రియ
- ఏప్రిల్ 1న నాటికి 18ఏళ్లు నిండిన యువతీ యువకులందరికీ ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం
- ఇష్టమైన చోట ఓటును మార్చుకునే వెసులుబాటు

● కొత్త ఓటర్లు 2 నుంచి 3శాతం పెరిగే అవకాశం

జిల్లాలో నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాలున్నాయి. జిల్లా వ్యాప్తంగా నాలుగు నియోజకవర్గాలను కలుపుకుని 3,63,665మంది పురుషులు, 3,64,823మంది మహిళలు, 14మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 7,28,502మంది ఓటర్లుండగా ప్రవాస భారతీయులు, సర్వీస్ ఓటర్లు మొత్తం 1135మంది ఉన్నారు.

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పద్దెనిమిది సంవత్సరాలు నిండిన యువతీ యువకులను ఓటర్లుగా నమోదు చేసుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. ఏప్రిల్ 1వరకు 18ఏళ్లు నిండిన వారంతా ఓటు హక్కు కోరుతూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే వీలును కల్పించింది. మరో ముఖ్యమైన అంశమేమిటంటే తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బదలాయించుకునే వెసులుబాటును కూడా ఎన్నికల సంఘం కల్పించింది. స్థానిక సంస్థల ఎన్నికల ముందు ఈ అవకాశం రావడంతో బరిలో ఉండాలనుకుంటున్న నాయకులు, తమ బంధువులు, అనుచరులను స్థానికంగా ఓటును బదలాయించుకునేలా ప్రయత్నాలను ముమ్మరం చేశారు. దీంతో ఇప్పటి నుంచే పల్లెల్లో రాజకీయ సందడి నెలకొంది. గతంలో కేవలం జనవరి 1నాటికే 18ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. ఈ విధానానికి ఎన్నికల కమిషన్ స్వస్తి పలికి జనవరి 1 నుంచి మళ్లీ తిరిగి జనవరి 1 వచ్చే వరకు మధ్యలో 18ఏళ్లు పూర్తి చేసుకున్న వారికి ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం రాని అంశాన్ని గుర్తించి ఈ విధానాన్ని సవరించింది. ఏడాదిలో జనవరి, ఏప్రిల్, జూన్, జూలై మాసాల్లో ఎప్పుడు 18ఏళ్లు నిండిన ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించడంతో యువ ఓటర్లలో ఉత్సాహాన్ని రేకెత్తిస్తుంది. 18ఏళ్లు పైబడిన వారంతా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఆన్‌లైన్ విధానాన్ని ఎన్నికల కమిషన్ అమల్లోకి తెచ్చింది. టీసీ, బోనాఫైడ్ లేదా టెన్త్ క్లాస్ మెమో ఆధారంగా తమ వయస్సును నిర్ధారించుకుని ఆన్‌లైన్‌లో ఇంటి అడ్రస్సుతో సహా పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. ఆ వార్డుకు సంబంధించిన బూత్ లెవల్ ఆఫీసర్ ప్రాథమికంగా అన్ని అంశాలను విచారణ చేస్తారు. బీఎల్‌వో సూపర్‌వైజర్ ఆ సమాచారం మొత్తం సరిగ్గా ఉందా లేదా అని నిర్ధారించి ఓటు హక్కుకు సంబంధించిన యోగ్యతపై ఎలక్షన్ సెల్‌కు నివేదికను అందజేస్తారు.

● యువ ఓటర్లను నమోదు చేసేందుకు ప్రత్యేక బృందాలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టు నిలుపుకుని మున్ముందు రాజకీయంగా మరింత బలపడాలని యోచిస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ మూడు రాజకీయ పార్టీలకు కూడా బూత్ స్థాయిలో పకడ్బందీ యంత్రాంగం ఉండటంతో ఏ ఇంట్లో ఎవరికి కొత్తగా ఓటు హక్కు రానుంది.. వారి సామాజిక వర్గం, కుటుంబ నేపథ్యం గురించి తరచూ సమావేశాలు నిర్వహిస్తూ కొత్త ఓటర్ల నమోదుకు కదలికను తీసుకొస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమైన నేపథ్యంలో భవిష్యత్తు రాజకీయాలకు ఎన్నికల ఫలితాలు దిక్సూచిగా మారనున్న నేపథ్యంలో యువ ఓటర్లను ఆకర్షించేందుకు అవసరమైన అన్ని ప్రయత్నాలు ప్రధానమైన రాజకీయ పక్షాలు చేస్తుండటం గమనార్హం.

సల్లబడదాం కాసేపు..


ఎండలు మండుతున్నాయి. మధ్యాహ్నం అయ్యిందంటే ఉక్కపోత ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. మనుషులతో పాటు జంతువులు కూడా ఎండ వేడిమికి అల్లాడుతున్నాయి. వనపర్తి జిల్లా పెద్దగూడెం గ్రామంలో ఎండకు శుక్రవారం మధ్యాహ్నం వేళ గ్రామస్థులు చెట్ల కింద చేరి ఉపశమనం పొందారు. బర్రెలు గ్రామంలోని చెరువులో సేద తీరి, అనంతరం అవీ చెట్ల కిందకు చేరాయి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి



చెట్ల కింద కూర్చున్న గ్రామస్థులు

క్లిక్.. క్లిక్..



ఎండకు చెట్ల కింద చేరిన బర్రెలు



చెరువులో సేద తీరుతున్న బర్రెలు

చెరువులో సేద తీరుతున్న బర్రెలు

సొరంగంలో నిర్విరామంగా..

- కొనసాగుతున్న సహాయక చర్యలు
- సకాలంలో పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నం
- ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి

6



సొరంగంలో జరుగుతున్న పనులను ప్రత్యేకాధికారికి వివరిస్తున్న రెస్క్యూ బృందం అధికారులు



ఆర్డీఎస్ ఆనకట్టకు చేరిన నీరు

ఆర్డీఎస్‌కు చేరిన ఏపీ ఇండెంట్ నీరు

- నేడు తెలంగాణ సరిహద్దుకు చేరే అవకాశం
- 10వేల ఎకరాలకు ఒక తడి!

● వివరాలు 6లో..

అదుపులో శాంతి భద్రతలు

- దేశంలోనే సీసీ కెమెరాల ఏర్పాటులో తెలంగాణ టాప్
- రాష్ట్రంలో సగానికి పైగా నేరాలు తగ్గుముఖం
- డీజీపీ డాక్టర్ జితేందర్



ధరూర్‌లో నూతన పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న రాష్ట్ర డీజీపీ జితేందర్, చిత్రంలో ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

అమరచింత/వనపర్తి క్రైమ్/ధరూరు/గద్వాల క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల ఏర్పాటులో భారత దేశంలోనే తెలంగాణ రాష్ట్రం టాప్‌గా నిలిచిందని, శాంతిభద్రతలు పూర్తిస్థాయిలో అదుపులో ఉన్నాయని రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ పేర్కొన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా అమరచింత మండలం మస్తీపూర్ గ్రామంలో ఐజి రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 46 సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. అలాగే, జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ వద్ద కోటీ 50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న పోలీస్ అవుట్ పోస్టు భవనానికి భూమిపూజ చేశారు. రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్ గుర్నాథ్ రెడ్డి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఐజీ రమేష్ రెడ్డి, మల్టీజోన్ టు ఐజీ సత్యనారాయణ, జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ రావుల గిరిధర్‌తో కలిసి ఆయన ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో డీజీపీ మాట్లాడుతూ... గత 20 ఏళ్లకు పోలిస్తే రాష్ట్రంలో నేరాలు సగంకు పైగా తగ్గిపోయాయని అన్నారు. చైనా, లండన్ తరువాత భారతదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటులో తెలంగాణ టాప్‌గా నిలిచిందని అన్నారు. 100 అనే సిస్టం పకడ్బందీగా అమలు చేస్తున్నామన్నారు.

అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి : ఎమ్మెల్యే

మక్తల్ నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో 100 శాతం సీసీ కెమెరాలు ఏర్పాటు అయ్యే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. మస్తీపూర్, నందిమల్ల గ్రామాల్లో డీజీపీ జితేందర్ తో కలిసి ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. అమరచింత మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్ రెడ్డి, డీజీపీ జితేందర్‌లు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. అమరచింతలో హై కోర్టు న్యాయవాది దేశాయ్ ప్రకాష్ రెడ్డి, మస్తీపూర్ గ్రామంలో ఐజీ రమేష్ రెడ్డి ఉండటంతో ఈ ప్రాంతంతో పాటు తమ నియోజకవర్గానికి శుభ పరిణామంగా భావిస్తామని అన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర కల్లు గీత విభాగం చైర్మన్ కేశం నాగరాజు గౌడ్, అదనపు ఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ శివకుమార్, ఎస్ఐ సురేష్ ఉన్నారు.

రాష్ట్రంలో మత్తు పదార్థాల నివారణకు ప్రత్యేక చర్యలు

రాష్ట్రంలో మత్తు పదార్థాల నివారణకు గత ఏడాదిన్నర నుంచి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. శుక్రవారం వనపర్తి మండల పరిధిలోని రాజపేట గ్రామ శివారులో నూతనంగా నిర్మించనున్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, పెట్రోల్ బంక్‌లను ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి, రావుల గిరిధర్‌తో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన సాయుధ దళ పోలీస్ కార్యాలయాన్ని, మినరల్ వాటర్ ప్లాంట్‌ను వారు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీజీపీ జితేందర్ మాట్లాడారు. అనంతరం జిల్లాలోని పోలీస్ అధికారులతో జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. టీజీహెచ్‌సీ ఎండీ రమేష్, హైదరాబాద్ మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ, జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, టీజీ హెచ్‌సీ తులసీధర్, టీజీ హెచ్‌సీతఈ హైదరాబాద్ రేంజ్ శ్రీనివాసరావు, డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను నియంత్రించాలి

రాబోయే వర్షాకాలంలో ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ సీడ్స్ జిల్లాలోకి రాకుండా నియంత్రించాలని, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు హైవే అథారిటీ, రవాణా శాఖ వారితో సమన్వయం చేసుకుంటూ ముందస్తు చర్యలు చేపట్టాలని తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్ జిల్లా పోలీస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజర్ డైరెక్టర్ ఎం. రమేష్, మల్టీజోన్-2 ఐజీ. వి.సత్యనారాయణ, జోగుళాంబ జోన్-7 డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్, ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ మొగులయ్య, సాయుధ దళ డీఎస్పీ నరేందర్‌రావు, కార్యాలయ ఏవో సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

ప్రజలకు నిత్యం అందుబాటులో పోలీసులు

ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా పోలీస్‌స్టేషన్ అందుబాటులో ఉండే విధంగా భవన నిర్మాణం చేపడుతున్నామని రాష్ట్ర డీజీపీ జితేందర్ అన్నారు. అదే సమయంలో ప్రజలకు అన్నివిధాలా న్యాయం చేసే విధంగా పోలీస్ శాఖ తరఫున కృషి చేస్తామని తెలిపారు. శుక్రవారం ధరూరులో నూతన పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణ భూమిపూజ కార్యక్రమానికి రాష్ట్ర డీజీపీ జితేందర్, పోలీస్ శాఖ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరయ్యారు. అంతకుముందు రాష్ట్ర డీజీపీకి, పోలీస్ శాఖ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యేకు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ మొగిలయ్య, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కురువ హనుమంతు, మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఎస్‌కు చేరిన ఏపీ ఇండెంట్ నీరు



ఆర్డీఎస్ కాలువలో నీటి పారుదల

- నేడు తెలంగాణ సరిహద్దులోకి చేరే అవకాశం
- 10వేల ఎకరాలకు ఒక తడి!

గద్వాల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యామ్ నుంచి ఆర్డీఎస్‌కు నీళ్ల చేరడంతో దాని కింద సాగు చేసిన రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేసీ కెనాల్ పరిధిలోని ప్రజలకు తాగునీటి అవసరాల మేరకు తన వాటాలో రెండు టీఎంసీల నీటిని విడుదల చేయాలని కోరింది. గత నెల 29వ తేదీ నుంచి ఈ నెల 1వ తేదీ వరకు 5వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేయాలని, 2వ తేదీన మిగిలిన 3,800 క్యూసెక్కులు చేయాలని కోరింది. ఆ మేరకు టీబీ డ్యామ్ అధికారులు నీటిని విడుదల చేశారు. ఆరు రోజుల పాటు నీళ్ల గుంతలు నిండుతూ.. కర్ణాటక మోటార్లు ఎత్తిపోస్తూ ఉండగా, గురువారం రాత్రి ఆర్డీఎస్‌కు చేరుకున్నాయి. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టకు 4పీట్ల 6ఇంచులకు చేరింది. దీంతో ఆర్డీఎస్ షటర్ల ద్వారా కాలువలోకి నీటిపారుదల ప్రారంభమైంది. శుక్రవారం మధ్యాహ్నం వరకు చార్మిన్ నగర్ దగ్గర పారుదల ఉంది. ప్రస్తుతం అక్కడ 170 క్యూసెక్కుల పారుదల ఉంది. నీటి ప్రవాహ వేగం నెమ్మదిగా ఉండటంతో అర్ధరాత్రి లేదంటే శనివారం ఉదయం తెలంగాణ సరిహద్దులోని 12ఏ డిస్ట్రిబ్యూటరీకు చేరుకునే అవకాశం ఉంది.

రైతులలో చిగురిస్తున్న ఆశలు..

ఆర్డీఎస్ కింద దాదాపు 20వేల ఎకరాలలో వరిసాగు అయ్యింది. ముందువేసిన రైతులు ఇప్పటికే గట్టెక్కగా మరో 10వేల నుంచి 12వేల ఎకరాలలోని రైతులకు మరో రెండు తడులు అందితే తప్ప పంట చేతికొచ్చే పరిస్థితి లేదు. ప్రస్తుతం ఆంధ్ర ఇండెంట్ నీళ్ల ఆర్డీఎస్ ఆనకట్టకు చేరడంతో ఆ నీళ్ల మరో మూడు రోజుల పాటు పారే అవకాశం ఉంది. ఆంధ్ర అధికారుల నుంచి ఎలాంటి అభ్యంతరం లేకపోతే మూడు రోజుల పాటు ఆర్డీఎస్ కాలువకు నీటి పారుదల ఉండే అవకాశం ఉంది. అలా జరిగితే దాదాపు 8వేల నుంచి 10వేల ఎకరాలకు ఒక తడి నీళ్ల పారే అవకాశం ఉంది. ఇది ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద నీటిప్రవాహం మీద ఆధారపడి ఉంది. ప్రస్తుతం నీటిపారుదల కర్ణాటకలో ఉండగా ఉదయానికల్లా తెలంగాణ సరిహద్దులోకి వస్తుందని అధికారులు తెలిపారు. దీంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ప్రజలు ధనవంతులుగా ఎదగాలి

ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ఎవరికీ లంచం ఇవ్వొద్దు



గోప్లాపూర్‌లో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పాన్‌గల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఎప్పటి నుంచో ఎంతో కష్టపడుతున్నా.. ప్రభుత్వం నుంచి ఎన్ని ఆరిక సహకారాలు అందిస్తున్నా.. ఇంకా పేదవారుగానే మిగిలిపోతు న్నారని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూ పల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండలంలో రేమద్దుల, కిష్టాపూర్ తండా, గోప్లాపూర్ , అన్నారం గ్రామంలో జాతీయ ఆహార ఉత్పత్తి కేంద్రంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పేద ప్రజలు సైతం సన్న బియ్యంతో భోజనం చేయాలనే ఉన్నత లక్ష్యంతో, రాష్ట్ర ప్రభుత్వం తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి ఒక్కొక్కరికి నెలకు 6 కిలోల చొప్పున ఉచితంగా నాణ్యమైన సన్న బియ్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్ల మంజూరయ్యాయని, జనాభా ప్రాతిపదికన అన్ని మండలాలకు గ్రామాలకు పంచడం జరుగుతుందని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని రేమద్దులకి వచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్‌చార్జి యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఉమాదేవి, విశ్వనాథ్, గోవర్ధన్ సాగర్ పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షలో మెరిసిన బీసీ కాలనీ విద్యార్థులు



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

నారాయణపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ఫిబ్రవరి 23న నిర్వహించిన టీజీసీఈటీ-2025 ఫలితాల్లో పేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల బీసీ కాలనీ విద్యార్థులు 11 మంది ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు మాధురి, అలివేలు, నిత్య, నవీన, శ్రావణి, మీనాక్షి, ప్రవీణ్, చరణ్, వినయ్, వరుణ్, మహదేవ్‌లు సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో ప్రవేశం పొందడంపై హెచ్ఎం అశోక్‌రెడ్డి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ సాయికుమారి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత

ఉప్పునుంతల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట మండల పరిధిలోని సింగారం గ్రామానికి చెందిన అంతయ్య నెల రోజుల క్రితం నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రానికి వెళ్లి తిరిగి స్వగ్రామం వెళ్తున్నాడు. ఉప్పునుంతల మండల పరిధిలోని వెల్టూరు గ్రామ స్టేజీ సమీపంలో తన ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి శుక్ర వారం స్టేషన్‌లో బాధితుడు అంతయ్యకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

సొరంగంలో నిర్విరామంగా

- కొనసాగుతున్న సహాయక చర్యలు
- సకాలంలో పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నం
- ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి

దోమలపెంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు సొరంగం ప్రమాద ఘటన జరిగి నేటికి 43 రోజులు కావొస్తున్నది. ప్రమాదం జరిగిన నాటి నుంచి నేటి వరకు రెస్క్యూ బృందాలు ప్రాణాలకు తెగించి సహాయక చర్యల్లో పాల్గొంటూ సొరంగంలో కూలిపడిన శిథిలాలను తవ్వుకుంటూ పనులు పూర్తి చేసేందుకు శ్రమిస్తున్నారు. శుక్రవారం ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి రెస్క్యూ బృందాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. టన్నెల్‌లో కొనసాగుతున్న పనుల్లో పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా సహాయ బృందాలు వారికి కేటాయించిన పనులను వేగవంతంగా చేపడుతూ, శిథిలాలను తొలగిస్తూ చిక్కున్న వారిని గుర్తించే ప్రయత్నం కొనసాగుతుందన్నారు. బండరాళ్లను కత్తిరించి ఇనుప శకలాలను లోకో ట్రైన్, బురద మట్టిని కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటకు పంపడం జరుగుతుందన్నారు. నిరంతరాయంగా నీటి ఊటను బయటకు పంపింగ్ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అంతే కాకుండా సహాయక చర్యల్లో పాల్గొనే సిబ్బందికి అందుతున్న వసతులు, ఆహారం తదితర విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమీక్షా సమావేశంలో ఆర్మీ అధికారులు వికాస్‌సింగ్, విజయ్‌కుమార్, సింగరేణి మైన్స్ రెస్క్యూ మేనేజర్ బైద్య, ఎన్‌డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా, రైల్వే, జీఎస్ఐ, ఇరిగేషన్, జేపీ కంపెనీ వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో 35 మీటర్ల శిథిలాల తొలగింపు

టన్నెల్‌లో కూలిన శిథిలాలతో పాటు విరిగిపోయిన టీబీఎం మిషన్ శకలాలను కత్తిరించుకుంటూ రెస్క్యూ బృందాలు 24 గంటలు పనులు కొనసాగిస్తున్నారు. కన్వేయర్ బెల్ట్‌ను 100 మీటర్ల వరకు పొడిగించిన తర్వాత గురు, శుక్రవార్లో సుమారు 500 మంది రెస్క్యూ సిబ్బంది పాల్గొంటూ గడిచిన రెండు రోజుల్లో 35 మీటర్ల వరకు శిథిలాలను తొలగించినట్లు సహాయక చర్యలో పాల్గొనే అధికారులు పేర్కొంటున్నారు. నిర్విరామంగా 5 యంత్రాలను ఉపయోగిస్తూ శిథిలాలను పెకిలిస్తున్నారు. నిర్విరామంగా యంత్రాలు నడుస్తున్నందుకు అప్పుడప్పుడు మొరాయిస్తున్నా వాటికి మరమ్మతులు చేసుకుంటూ పనులు కొన సాగుతున్నాయి. ప్రభుత్వం విధించిన గడువు వరకు పనులు పూర్తి చేసేందుకు రెస్క్యూ బృందాలు శ్రమిస్తున్నాయి.



టన్నెల్ లోపలి నుంచి కన్వేయర్ బెల్ట్‌పై శిథిలాలను తరలిస్తున్న



నేలరాలిన మామిడిని ఏరివేసి ఒకచోటికి చేర్చిన రైతులు



మానవపాడులో తడిసిన మిర్చిని ఆరబెట్టిన రైతులు

మామిడి రైతు విలవిల

- 150 ఎకరాలలో రాలిన కాయలు
- నేలకొరిగిన బొప్పాయి చెట్లు
- కల్లాల్లోనే తడిసి ముద్దయిన మిరప

గద్వాల/మానవపాడు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి) జోగుళాంబ గద్వాల జిల్లాలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులు.. గాలి దుమారంతో వర్షం కురిసింది. ఈ అకాల వర్షానికి పంట చేతికొచ్చిన రైతులతో పాటు మామిడి రైతులు విలవిలలాడారు. జిల్లాలో ఎక్కువగా మామిడి తోటలు కేటీదొడ్డి, గట్టు, ఇటిక్యాల మండలాల్లో ఉన్నాయి. ఇప్పటికే కాయలు కాచి త్వరలో పక్వానికి వస్తాయి అనుకుంటున్న సమయంలో ఒక్కసారిగా పెద్ద ఎత్తున వీచిని గాలికి రాలిపోయాయి. కొన్ని చెట్లు నేలకొరిగాయి. ఇటిక్యాల మండలం మొగిలిరావుల చెరువు గ్రామంలో దాదాపు 50ఎకరాల్లో మామిడి తోటలు ఉండగా పెద్దఎత్తున రాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. రాలిపోయిన కాయలు రైతులు పోగుచేసే పనిలో ఉన్నారు. అదేవిధంగా కేటీదొడ్డి మండలంలో ఇసుక నేలలు కావడంతో పెద్ద ఎత్తున మామిడి తోటలు ఉన్నాయి. గురువారం వీచిన గాలి దుమారానికి దాదాపు 100ఎకరాలలో 16మంది రైతులకు చెందిన మామిడి కాయలు నేలరాలాయని హార్టికల్చర్ అధికారులు ప్రకటించారు. అయితే రాలిన కాయలలో కొన్ని పక్వానికి వచ్చే కాయలు ఉండటంతో రైతులు వాటిని విక్రయించుకోవచ్చని కానీ చాలా కాయలు చిన్నవిగా ఉండటంతో రైతులు నష్టపోయే పరిస్థితి ఉందని వారు ప్రకటించారు.

అకాల వర్షంతో నష్టం

అకాల వర్షం పంటలను నష్టం చేయడమే కాకుండా ఇప్పటికే తెంపి ఆరబెట్టిన మిరపను కూడా తడిపి ముద్దచేసింది. మిరపకు గిట్టుబాటు ధర లేకపోవడంతో చాలా మంది రైతులు కోతకోసిన(తెంపిన) మిరపను కల్లాలలోనే ఆరబోసుకున్నారు. వర్షం సూచనలు లేకపోవడంతో రైతులు వాటిపై ఎలాంటి టార్పాలిన్‌లు కప్పలేదు. అయితే సాయంత్రం గాలి దుమారంతో లేచి ఉరుములతో కురిసిన వర్షాలనికి తడిసి ముద్దయ్యాయి. ఇటిక్యాల, మానవపాడు, ఉండవల్లి, వడ్డేపల్లి మండలాల్లోని మిరప రైతులు నష్టపోయారు. అదేవిధంగా గద్వాల మండలంలోని కొండపల్లిలో దాదాపు 30ఎకరాల్లో బొప్పాయి తోటను సాగుచేశారు. గాలి దుమారంతో బొప్పాయి చెట్లు నేలకొరిగాయి. కోతకు వచ్చిన కాయలు నేలమట్టం అయ్యాయని గ్రామానికి చెందిన నర్సింహులు, దామోదర్, సుంకన్న, జగదీష్ తదితర రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సన్నాలకు సై

(మిగతా 6లో..)

దాదాపు రూ.270.98 కోట్లు రైతులకు బోనస్ రూపంలో లబ్ధి చేకూరింది.



సీసీకుంట మండలం లాల్‌కోటలో ధాన్యాన్ని లారీలోకి ఎత్తుతున్న రైతులు

రీసైక్లింగ్‌కు అడ్డుకట్ట..

గతంలో రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం మాత్రమే పంపిణీ చేసేవారు. ఈ బియ్యాన్ని తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న ప్రజలంతా తినలేదు. వాటిని అక్కడే విక్రయించడమో లేదంటే, తర్వాత దళారులకు కిలోకు రూ.12 నుంచి రూ. 15 వరకు విక్రయించడమో చేసేవారు. దీనివల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేర లేదు. మెజారిటీ కార్డు దారులు ప్రతీ నెలా దొడ్డు బియ్యం తీసుకుని అమ్మి, సన్నబియ్యం కొనుగోలు చేసుకునేవారు. ఇప్పుడు రేషన్ దుకాణాల్లోనే సన్న బియ్యం పంపిణీ చేస్తుండటంతో కార్డు ఉన్న ప్రతీ ఒక్కరూ వాటిని తీసుకుని అన్నం వండుకుని తిననున్నారు. దాంతో రేషన్ బియ్యం రీసైక్లింగ్‌కు అవకాశం ఉండదు. గతంలో రీసైక్లింగ్ చేసిన బియ్యాన్ని తిరిగి తమ కోటా సీఎంఆర్ కింద మిల్లర్లు తిరిగి అప్పగించేవారు. సీఎంఆర్ గడువు 90 రోజులే అయినప్పటికీ.. సామర్థ్యానికి మించి కేటాయింపులు చేయడంతో వాటిని అమ్ముకునేవారు. తర్వాత రేషన్ బియ్యంతో భర్తీ చేయడానికి చాలా సమయం పట్టేది. చాలా మిల్లులు ఈ పద్ధతి ద్వారా డీఫాల్ట్‌కు గురయ్యాయి. డీఫాల్ట్ మిల్లర్లను దారిలోకి తెచ్చేందుకు ప్రభుత్వం రెవెన్యూ రికవరీ యాక్టు ప్రయోగించడంతోపాటు బ్యాంకు గ్యారంటీలను కూడా ప్రవేశపెట్టింది. ప్రభుత్వం గతంలో ఎలాంటి ష్యూరిటీ లేకుండా ధాన్యం అప్పగించి.. వారు సీఎంఆర్ ఎప్పుడు ఇస్తే అప్పుడే తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు బ్యాంకు గ్యారంటీలు, డీఫాల్ట్ మిల్లులకు కేటాయింపులు చేయకపోవడం, సన్నాలకు బోనస్ ప్రకటించడం, సన్నబియ్యం పంపిణీ చేపట్టడం ద్వారా పౌరసరఫరాల శాఖ ప్రక్షాళన జరుగుతుందని పలువురు ఆశిస్తున్నారు.

గో సంరక్షణతోనే ధర్మ పరిరక్షణ

- అంబాత్రయ క్షేత్ర స్థాపకులు ఆదిత్య పరాశ్రీ స్వామి



హాజరైన పీఠాధిపతులు

మక్తల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గో సంరక్షణతోనే ధర్మ పరిరక్షణ సాధ్యమని అంబాత్రయ క్షేత్ర స్థాపకులు ఆదిత్య పరాశ్రీ స్వామి అన్నారు. శుక్రవారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం బిజ్వార్ గ్రామంలో వెలసిన అంబాత్రయ క్షేత్రంలో గోమాత కల్యాణం నిర్వహించారు. కల్యాణాన్ని వీక్షించేందుకు తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. పీఠాధిపతులు భాగలింగేశ్వరస్వామి, పరమాత్మనందస్వామి, చరణ్‌స్వామి, సంగ్రామ మహరాజ్‌స్వామి, రాజయ్యస్వామి, అంబిక శివయోగస్వామి, మహానందగిరి గౌతమి, గోవర్ధనస్వామి, పంచమ సిద్ధలింగ స్వామీజీలు పాల్గొని ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ప్రకృతికి, ధర్మానికి మూలం గోవు అని, గోవును రక్షిస్తే ధర్మం, ప్రకృతి నిలబడుతుందన్నారు. గోమాతలో సర్వ దేవతలు ఉన్నారన్నారు. గోవుకు పూజలు చేస్తే 33 కోట్ల దేవతలకు పుణ్యం చేసినట్లు అవుతుందన్నారు. నేడు గోసంపద తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గోవులు అంతరిస్తే సనాతన ధర్మం అంతరిస్తుందన్నారు. అనంతరం గోమాత కల్యాణానికి వచ్చిన స్వామిజీలు, నాయకులకు ఆదిత్య పరాశ్రీస్వామి సన్మానించారు.

రక్తదాన శిబిరం విజయవంతం

గోమాత కల్యాణం సందర్భంగా అంబాత్రయ క్షేత్రం వద్ద నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. శిబిరంలో యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అలాగే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

రైలు ప్రయాణికుల ప్రాణాలు కాపాడిన యువతి



జోగు శ్వేతాశ్రీ

మరికల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మరికల్ మండలం పసుపుల గ్రామానికి చెందిన జోగు శ్వేతాశ్రీ బెంగళూరులో లోకో పైలట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గురువారం రాత్రి గుడిమెట్ల రైల్వే క్రాసింగ్ గేట్ వద్ద పట్టాల మధ్యలో ఆగి ఉన్న లారీని గమనించింది. వెంటనే అప్రమత్తమై ఎమర్జెన్సీ బ్రేక్ వేసి రైలును ఆపేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రాకపో కలకు మాత్రం కొద్దిసేపు అంతరాయం కలిగింది. ఆ తర్వాత రైల్వే ఉన్నతాధికారులకు సమాచారం అందించింది. లారీని పక్కకు తీయించి రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. విషయం తెలుసుకున్న ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. రైల్వే అధికారులు శ్వేతాశ్రీని అభినందించారు. సమాచారం తెలిసిన గ్రామస్థులు ఆమె ను అభినందించారు. గ్రామానికి వచ్చినప్పుడు సన్మానిస్తామని ఆమెకు తెలిపారు.

వేసవిలో పిల్లలను రక్షించుకోవడం మన బాధ్యత



కస్తూర్బాగాంధీ పాఠశాలలో జిల్లా షీటీం ఇన్‌చార్జి విజయలక్ష్మి

పెంట్లవెల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పిల్లల్ని రక్షించుకోవడం మన బాధ్యత అని నాగర్‌కర్నూల్ జిల్లా షీటీం ఇన్‌చార్జి విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈవిటీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, బాల్య వివాహాలు, బాల కార్మికులు, సైబర్ వేధింపులు, వేసవి సెలవుల్లో వేధింపులు లాంటివి ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మహిళలు, విద్యార్థులు వేధింపులకు గురైతే షీటీం అండగా ఉంటుందన్నారు. మహిళ భద్రతే మా లక్ష్యమని ఆమె అన్నారు. వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో షీటీమ్ మెంబర్ వెంకట్‌రాథోడ్, పాఠశాల ఇన్‌చార్జి సలీహాబేగం, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

కోరిన కోర్కెలు తీర్చే కోర మీసాల రాముడు


ఆలయంలో కొలువుదీరిన సీతా రామ లక్ష్మణులు

- సీతా, లక్ష్మణ సమేతంగా కొలువు దీరిన స్వామి
- అపర భద్రాద్రిగా ప్రఖ్యాతిగాంచిన సిరసనగండ్ల
- నేటి నుంచి 11వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు
- ప్రభుత్వ లాంఛనాలతో సీతారాముల కల్యాణోత్సవం


ఆలయ రాజగోపురం

చారకొండ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కోరిన కోర్కెలు తీర్చే కోర మీసాల రాముడు సీతా లక్ష్మణ సమేతంగా కొలువు దీరిన సిరసనగండ్ల క్షేత్రం బ్రహ్మోత్సవాలకు సిద్ధమయ్యింది. నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలం, సిరసనగండ్ల గ్రామపంచాయతీ పరిధిలోని అయోధ్యనగర్ గుట్టపై దాదాపు 500 అడుగుల ఎత్తయిన ఏకశిలపై సీతా రామచంద్రుడి ఆలయం ఉంది. అపర భద్రాద్రిగా పేరు గాంచిన ఈ క్షేత్రంలోని సీతారామచంద్రస్వామి దేవాలయాన్ని 14వ శతాబ్దంలో రాచకొండ పద్మనాయకుల హయాంలో నిర్మించినట్లు ఒక స్తంభంపై ఉన్న శిలాశాసనంలో రాసి ఉంది. ఈ ఆలయ నిర్మాణానికి ముందే ముక్కుడి పోచమ్మ దత్తాత్రేయ దేవాలయాలు ఉన్నాయి.

ఇదీ ఆలయ చరిత్ర

సిరసనగండ్ల గ్రామానికి చెందిన ఢేరం రామయాజ్వీ ప్రతీ రోజు దత్తాత్రేయ ఆలయంలో తపస్సు చేసేవాడు. ఒక రోజు అతడికి కలలో సీతారామచంద్రస్వామి దర్శనమిచ్చాడు. భద్రాచలంలో ప్రతిష్ఠించే సమయానికి తమ విగ్రహాలు తయారు కాలేదని, దీంతో అక్కడ వేరే విగ్రహాలను ప్రతిష్ఠించారని తెలిపాడు. ముందుగా సిద్ధం చేసిన విగ్రహాలను ఖమ్మం జిల్లా, పాల్వంచలోని రావిచేడు గ్రామంలో భాస్కరుడనే బ్రాహ్మణుని ఇంటి పెరట్లో ఉన్న కాకర పాదుకింద భద్ర పరిచినట్లు తెలిపాడు. వాటిని తీసుకొచ్చి సిరసనగం డ్ల గుట్టపై ప్రతిష్ఠించాలని చెప్పి అంతర్ధానమయ్యా డు. ఈ విషయాన్ని రామయాజ్వీ గ్రామ పెద్దలకు చె ప్పడంతో వారు నమ్మలేదు. దీంతో వారికి కూడా స్వా మి స్వప్నంలో దర్శనం ఇచ్చి విషయాన్ని తెలిపారు. దీంతో వారు మేళతాళాల నడుమ ఎద్దుల బండ్లపై ఖమ్మం పట్టణానికి వెళ్లి అక్కడి రాజును కలిసి విషయం తెలిపారు. దీంతో ఆ రాజు తన భటులతో కలిసి రావిచేడు గ్రామానికి వెళ్లారు. అక్కడ భాస్కరుడి ఇంటికి వెళ్లి స్వప్న వృత్తాంతాన్ని తెలిపారు. కాకర చెట్టు పాదును తవ్వడంతో సీత, రాముడు, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి విగ్రహాలు కనిపించాయి. వాటిని తీసుకొస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. జరిగింది వారికి చెప్పడంతో వారు అంగీకరించారు. కానీ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని తమ గ్రామంలోనే ప్రతిష్ఠించుకుంటామని స్పష్టం చేశారు. దీంతో ఆ విగ్రహాన్ని వారికి ఇచ్చేశారు. అనంతరం సీత, రాముడు, లక్ష్మణుల విగ్రహాలను సిరసనగండ్లకు తీసుకొచ్చారు. గుట్టపై ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా పోచమ్మ అమ్మవారు వచ్చి అభ్యంతరం తెలిపింది. దీంతో శ్రీరాముడు ప్రత్యక్షమై భక్తులు నీ దర్శనం తర్వాతనే తమను దర్శించుకుంటారని అభ యం ఇచ్చారు. అనంతరం విగ్రహాలను ప్రతిష్ఠించారని పురాణ కథనం. గుట్టపై నైరుతిలో పోచమ్మ తల్లి, తూర్పుదిశలో సీతారామచంద్ర స్వామి భక్తులకు దర్శనమిస్తారు. రాములవారికి రక్షణగా అష్టదిక్కుల్లో ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతి ష్ఠించారు. ఇక్కడ కొలువు దీరిన రాముడు కోరమీసంతో ఉండడం, సీతమ్మతల్లి స్వామి వైపు వోరగా చూస్తూ ఉండటం ఇక్కడి విశేషమని భక్తులు చెప్తుంటారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు ఇక్కడ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయ ఫౌండర్ ఢేరం రామశర్మ, ఈవో స్వర్గం ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆలయాన్ని మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలలతో అలంకరించారు. భక్తులు సేద తీరేందుకు చలువ పందిళ్లతో పాటు తాగునీటి వసతిని కల్పించారు. ఈ ఉత్సవాలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నలుమూలల నుంచే కాకుండా, రంగారెడ్డి, నల్గొండ, హైదరాబాద్ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. శ్రీరామనవమి రోజున భద్రాచలంలో మాదిరిగానే ఇక్కడ కూడా ప్రభుత్వ లాంఛనాలతో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తారు.

ఉత్సవాలు కొనసాగేది ఇలా..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలి రోజు ఐదవ తేదీన ఉదయం ధ్వజారోహణం నిర్వహించ నున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారికి మాస కల్యాణోత్సవం, ఎదురుకోళ్ల, పల్లకీ సేవ, మహానివేదన ఉంటాయి. 6న ఉదయం స్వామివారికి అభిషేకం, అర్చనలు, మధ్యాహ్నం 12 గంటలకు సీతారాముల కల్యాణం, రాత్రి ప్రదోష రాజోపచారాలు, హనుమత్‌సేవ నిర్వహించనున్నారు. 7న చిన్న రథోత్సవం (పూలతేరు) కుంకుమార్చన, 8న శివదత్తాత్రేయ, పరశు రాముడు, అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు ఉంటాయి. రాత్రి గరుడ వాహనసేవ, 9న పెద్దరథోత్సవం నిర్వహించనున్నారు. 10న పల్లకీసేవ, నాగబలి, పూర్ణాముతి, గజ వాహనసేవ, దోపోత్సవం ఉంటాయి. 11న పోచమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక అర్చనలు, రాత్రి పల్లకీ సేవ, చక్రతీర్థం, ద్వాదశ ఆరాధన, ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి

చారకొండ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిరసనగండ్ల సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి జరుగనున్నందున ఏర్పాట్లను నాయకులు, ఎస్ఐ శంషొద్దీన్‌తో కలిసి వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ స్వామివారి ఆలయ సమీపంలో 25, గుట్ట దిగువన 10 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పార్కింగ్ స్థలాల్లో వాహనాలకు ఎవరైనా చార్జీ వసూలు చేస్తే వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా బారీ పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని వసతులు కల్పించాలని ఆలయ ఈవో స్వర్గం అంజనేయులుకు సూచించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్, కాంగ్రెస్ మండల యూత్ ప్రసిడెంట్ గణేష్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి మహేందర్, మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, కల్లు సురేందర్‌రెడ్డి, ఆలయ మేనేజర్ నిరంజన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మాస కల్యాణం

సిరసనగండ్ల సీతారామచంద్రస్వామి దేవాలయంలో నేడు స్వామివారి మాస కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ ఢేరం రామశర్మ, ఈవో స్వర్గం అంజనేయులు తెలిపారు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన బొడ్డు స్వాతి, నవీన్ దంపతులు సీతమ్మవారికి రూ. 40 వేలు విలువగల వెండి కిరీటాన్ని ఆలయ అర్చకుడు ఢేరం లక్ష్మణశర్మకు అందజేశారు.

క్రైం కార్నర్

పాలికి చెరువులో మృతదేహం లభ్యం

పాన్‌గల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పాలికి చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన స్థానికులు వ్యవసాయ పొలాలకు వెళ్తుండగా.. చెరువులో మృతదేహం కనిపించడంతో వారి సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని వెలికి తీశామని, చెరువు ఒడ్డున శాలువా, చెప్పులు, కల్లు ప్యాకెట్ లభ్యమైనట్లు చెప్పారు. మృతదేహాన్ని జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించామని తెలియజేశారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

మక్తల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని మక్తల్ నారాయణపేట జిల్లా పట్టణానికి చెందిన యువకుడు కుర్వ రాజు(25) మృతి చెందిన సంఘటన శుక్రవారం కర్ణాటక రాష్ట్రం సైదాపూర్ సమీపంలోని రైల్వే వంతెన వద్ద చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన కుర్వ రాజు డిగ్రీ పూర్తి చేసుకున్నాడు. ఇటీవల తన సోదరుడి వివాహం కావడంతో కర్ణాటక రాష్ట్రంలో ఉన్న గొర్రెల మంద వద్దకు కాపరిగా వెళ్లాడు. సైదాపూర్ సమీపంలోని మునగాల రైల్వే వంతెన సమీపంలో గొర్రెలకు నీరు తాగించేందుకు వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా మూడు గొర్రెలు అక్కడే ఉండటాన్ని గుర్తించి మళ్లీ అక్కడకు చేరుకున్నాడు. గొర్రెలను తీసుకువచ్చే క్రమంలో రైలు కింద పడి మృతి చెందాడు. ప్రమాదంలో మూడు గొర్రెలు కూడా మృతి చెందాయి. గమనించిన తోటి కాపరి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మక్తల్‌కు తరలించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

అడవి జంతువు దాడిలో దూడ..

వంగూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాజాల గ్రామం శివారులోని పొలం వద్ద దొడ్డిలో ఉన్న గేదెదూడపై గురువారం రాత్రి గుర్తు తెలియని అడవి జంతువు దాడి చేయడంతో మృతి చెందింది. రైతు శ్రీనివాసులు ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా గేదె మృతి చెంది ఉందని, మెడ, గొంతు భాగంలో తీవ్రంగా కొరికిన గాయాలు ఉన్నాయని రైతు తెలిపారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అటవీ శాఖ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, ఆ జంతువును పట్టుకునేందుకు తుగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సారా అమ్మితే కఠిన చర్యలు


చారకొండ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఎవరైనా సారా అమ్మినా, తయారు చేసినా, పటిక బెల్లం విక్రయించినా అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కల్వకుర్తి ఎక్సైజ్ శాఖ సీఐ వెంకట్ రెడ్డి అన్నారు. కల్వకుర్తి ఎక్సైజ్ టీం, మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని స్థావరాలపై దాడులు నిర్వహించారు. 600 కిలోల నల్ల బెల్లం, 30 కిలోల పటిక, 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని, ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇసుక నిల్వలు సీజ్


ఇసుక నిల్వల వద్ద తహసీల్దార్ శ్రీనివాసులు

కోస్గి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా పొలాల వద్ద నిల్వ చేసిన ఇసుక నిల్వలను తహసీల్దార్ శ్రీనివాసులు సీజ్ చేశారు. నారాయణపేట జిల్లా కోస్గి మండలం కడంపల్లి గ్రామ శివారులో అనుమతి లేకుండా పొలాల వద్ద ఇసుక నిల్వ చేశారన్న పక్కా సమాచారంతో తహసీల్దార్ శ్రీనివాసులు శుక్రవారం ఘటనా స్థలానికి వెళ్లి 40 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుకను మండలంలోని చంద్రవంచ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు సరఫరా చేశారు. మండలంలో ఇంకా ఎవరైనా అనుమతి లేకుండా ఇసుక నిల్వ చేస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ లింగారెడ్డి, సిబ్బంది హన్మంతు తదితరులున్నారు.

ఇంటికి చేరిన మతిస్థిమితం లేని బాలిక


ఇంటికి చేరిన మతిస్థిమితం లేని బాలికతో తల్లిదండ్రులు, చైల్డ్‌వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ సభ్యులు

తిమ్మాజిపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : తిమ్మాజిపేట మండల పరిధిలోని చేగుంట గ్రామానికి చెందిన గడ్డం వెంకటయ్య కుమార్తె అమ్ములు మతిస్థిమితం కోల్పోయి వెళ్లి, ఎట్టకేలకు శుక్రవారం ఇంటికి చేరింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 1న సాయంత్రం 4గంటల సమయంలో ఇంటి నుంచి బయల్దేరి మరుసటి రోజు గద్వాల రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండడం గమనించిన రైల్వే పోలీసులు ఆమెతో వివరాలు అడిగారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ వారికి ఆమెను అప్పజెప్పగా వారు చేగుంట గ్రామంలో తల్లిదండ్రులకు అప్పజెప్పారు. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 టీం కో ఆర్డినేటర్ మౌనిక, కవిత, మల్లేశ్, మధు, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మీ, గడ్డం చెన్నయ్య తదితరులు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


అమ్రాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అమ్రాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల ఆకలి తీర్చడం కోసం రాష్ట్రవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి శుక్రవారం అమ్రాబాద్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరి నారాయణ గౌడ్, వెంకటయ్య, మల్లికార్జున్, నాసరయ్య, వెంకటేశ్వర్లు, బాల్‌లింగంగౌడ్, తిరుమల్లయ్య, తిరుపతయ్య గౌడ్, మనోహర్, శేఖర్ ఉన్నారు.

శక్తిపీఠంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- ఆలయాలను పరిశీలించిన గద్వాల కలెక్టర్ సంతోష్


అలంపూర్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ బీఎం. సంతోష్

అలంపూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అలంపూర్ శ్రీజోగుళాంబదేవి, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను భక్తులకు సౌకర్యవంతంగా, పర్యాటక అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించి అమలుచేయాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జోగుళాంబ దేవస్థానం అభివృద్ధి కోసం కమిటీ సభ్యులతో కలిసి అలంపూర్ ఆలయాలను, ముఖ్య ప్రాంతాలను, పార్కింగ్ కోసం 20ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమిని పరిశీలించారు. ఇటిక్యాల క్రాస్‌రోడ్డు, మానవపాడు, అలంపూర్ క్రాస్‌రోడ్డు, అలంపూర్ ఫ్లైఓవర్ వద్ద ఏర్పాటు చేసిన ఆలయ బోర్డులను పరిశీలించారు. మరింత ఆకర్షణీయంగా, సృజనాత్మకంగా ఏర్పాటు చేయాలని చెప్పారు. హైదరాబాద్ నుంచి ఎర్రవల్లి, అలంపూర్ వరకు జాతీయ రహదారిలో ఆలయ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ రావు, ఆర్డీవో శ్రీనివాసరావు, ఆలయ చైర్మన్ నాగేశ్వర్, దేవాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణ రావు, ఆర్కిటెక్ సూర్యనారాయణ మూర్తి, శ్రీలేఖ, కేంద్ర పురావస్తు శాఖ అధికారి రోహిణి పాండే, ఆర్కియాలజీ నాగలక్ష్మీ, ఈవో పురేందర్, డీపీవో నాగేంద్రం, తహసీల్దార్లు ప్రభాకర్, మంజుల, మునిసిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రావు, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ ఈఈ కిరణ్ అధికారులు పాల్గొన్నారు.

గ్రూప్-1 విజేతకు సన్మానం

- గ్రూప్-1 ఫలితాల్లో ఉద్యోగం సాధించిన వనపర్తి డిపో ఉద్యోగి కుమారుడు
- ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతులు మీదుగా సన్మానం పొందిన రాఘవేందర్‌రెడ్డి


సజ్జనార్ చేతుల మీదుగా సన్మానం పొందుతున్న రాఘవేందర్‌రెడ్డి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విడుదలైన తెలంగాణ గ్రూప్-1 పరీక్ష ఫలితాల్లో వనపర్తి ఆర్టీసీ డిపోలో టీఐ-2గా (డిప్యూటీ సూపరింటెండెంట్ ట్రాఫిక్) విధులు నిర్వహిస్తున్న బాల్‌రెడ్డి కుమారుడు రాఘవేందర్‌రెడ్డి 480 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 143వ ర్యాంక్ సాధించా డు. సంస్థలో పని చేస్తున్న కార్మికుల పిల్లలు ఉన్నత శిఖరాలు అధిరోహించడం సంస్థకే గర్వకారణమని ఆర్టీసీ సంస్థ ఎండీ సజ్జనర్ రాఘవేందర్ రెడ్డిని హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు. ఈయన ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు నాగర్‌కర్నూల్‌లోని సరస్వతీ విద్యానికేతన్ పాఠశాలలో, ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు వట్టెం నవోదయ పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కళాశాలలో, బీటెక్ హైదరాబాద్‌లోనే పూర్తి చేశాడు. అనంతరం సెంట్రల్ హోమ్ మినిస్ట్రీలో విధులు నిర్వహిస్తూ... గ్రూప్-1 పరీక్షలకు ఎంపికయ్యాడు. రాఘవేందర్ తల్లి పుష్పలత కూడా నాగర్‌కర్నూల్ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. విషయం తెలుసుకున్న సంస్థ ఎండీ సజ్జనార్ రాఘవేందర్‌రెడ్డిని కుటుంబ సమేతంగా హైదరాబాద్ కు పిలిచి ఘనంగా సన్మానించారు. సంస్థలో పని చేస్తున్న ప్రతీఒక్క కార్మికుడు రాఘవేందర్‌ను ఆదర్శంగా తీసుకుని తమ పిల్లలను ఉన్నతంగా చదివించాలని ఆకాంక్షించారు.

రైస్‌మిల్‌పై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడి

- 624 బస్తాల పీడీఎస్ బియ్యం స్వాధీనం
- యజమానిపై కేసు నమోదు, రైస్ మిల్లు సీజ్


బియ్యం బస్తాలను లెక్కిస్తున్న అధికారులు

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : విజిలెన్స్, సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఓ రైస్ మిల్లుపై దాడి చేసి పెద్దఎత్తున పీడీఎస్ బియ్యాన్ని అధికారులు సీజ్ చేసిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో శుక్రవారం చోటు చేసుకుంది. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం కొత్తపేట గ్రామ సమీ పంలోని బాలాజీ రైస్ మిల్లులో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారు లు దాడులు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా పీడీఎ స్ బియ్యం బస్తాలను భారీగా నిల్వ ఉంచడంతో అధికారులు స్వాధీ నం చేసుకున్నారు. సుమారు 624 బ్యాగులు (32) క్వింటాళ్ల పీడీఎస్ రైస్ ఉన్నట్లు గుర్తించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు పక్కా సమాచారం అందించడంతో పీడీఎస్ రైస్‌ను స్వాధీనం చేసుకుని కొల్లాపూర్ స్టాక్ పాయింట్‌కు తరలించారు. బాలాజీ రైస్ మిల్లును సీజ్ చేసి మిల్లు యజమాని సునీల్ శెట్టిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గతంలోనూ ఇదే రైస్ మిల్లు యజమాని సునీల్‌శెట్టిపై కేసులు అయినట్లు సివిల్ సప్లయ్ అధికారి హేమ్లానాయక్ తెలిపారు. ఈ దాడిలో తహసీల్దార్ రాజశేఖర్, విజిలెన్స్ సీఐ రవీందర్, డీఎల్‌పీవో సురేష్ ఉన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణ మహోత్సవం


కల్యాణతంతు నిర్వహిస్తున్న పురోహితులు

శ్రీరంగాపూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపూర్‌లో సప్తమి రోజు సీతారాముల కల్యాణం జరపడం ఆనవాయితీగా వస్తుంది. కొన్ని తరాల నుంచి ఇక్కడ శ్రీరామ నవమి కంటే రెండు రోజుల ముందే జరుపుకోవడం ఇక్కడి ఆచారం అని భక్తులు తెలిపారు. గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి కూడా సీతారాముల కల్యాణోత్సవానికి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కల్యాణోత్సవాన్ని బుక్క వెంకట్ స్వామి కుమారులు నిర్వహించిన, అన్నదానం చేశారు.

శ్రీరామ నామం మోక్షప్రదం

30,116 బియ్యపు గింజలపై రాసిన చక్రవర్తి ఆచార్యులు


శ్రీరామ నామం లిఖించబడిన బియ్యపు గింజలు

అయిజ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నామమే మోక్షప్రదం అనిభావించి ప్రతీ సంవత్సరం బియ్యపు గింజలపై శ్రీరామ నామం రాసి వాటిని కల్యాణ తలంబ్రాలుగా ఉపయోగిస్తున్నారు. ఇలా గత 15 సంవత్సరాలుగా జరుగుతోంది. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మునిసిపాలిటీ పరిధిలోని రామాలయంలో అర్చకుడిగా కొనసాగుతున్న చక్రవర్తి ఆచార్యులు ఈ కార్యక్రమాన్ని ముందుకు సాగిస్తున్నారు. ఈ నెల 6వ తేది ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా సీతారామ కల్యాణం కొనసాగనుంది. ఈ నేపథ్యంలో 30,116 బియ్యపు గింజలపై శ్రీరామ నామాన్ని రాశాడు. వీటిని కల్యాణంలో తలంబ్రాలుగా వాడనున్నట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి



చెక్కులను అందజేస్తున్న మంత్రి జూపల్లి

పాన్‌గల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఆబ్కారీ పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రైతు వేదికలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ల ద్వారా పథకం అమలు చేయడం జరుగుతుందన్నారు. ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ సత్యనారాయణ రెడ్డి, ఎంపీడీవో గోవిందరావు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

పెద్దమందడి : అమ్మపల్లె గ్రామ మాజీ సర్పంచ్ విట్టా పుల్లారెడ్డి ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

చిన్నంబావి : మండల పరిధిలోని బెక్కెంగూడెంలో అనారోగ్య సమస్యలతో చికిత్స పొందిన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ సర్పంచ్ చక్రవర్తి అందజేశారు. శ్రీను కురుమూర్తి, సుధాకర్, రాముడు, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి..

వనపర్తి రూరల్ : మండల పరిధిలోని చిమనగుంటపల్లికి చెందిన శివయ్య విద్యుదాఘాతంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానాలో వేర్వేరుగా పరామర్శించారు.

సీపీఎం అఖిల భారత మహాసభకు తరలిన నాయకులు

అమరచింత, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడు రాష్ట్రం మధురైలో కొనసాగుతున్న సీపీఎం 24వ మహాసభలకు అమరచింత మండల సీపీఎం నాయకులు శుక్రవారం తరలి వెళ్లారు. మధురై వెళ్లిన వారిలో సీపీఎం మండల కార్యదర్శి జీఎస్ గోపి, నాయకులు బాల్ రెడ్డి, రాజు, ఆర్ఎన్ రమేష్, అజయ్, రవి తదితరులు వెళ్లిన వారిలో ఉన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల సమస్యలు తక్షణ పరిష్కరించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వనపర్తి ఆర్టీసీ డిపో ఎదుట సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిపో మేనేజర్‌కు ఇచ్చారు. ఎండీ ఖయ్యూం, ఆర్ గోపిగౌడ్, బీవీ రావు, పీఎన్‌గౌడ్, పాషా, ఆర్‌వీ గౌడ్ పాల్గొన్నారు.

పనికి తగ్గ పారితోషికం ఇవ్వాలి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు ప్రభుత్వం పనికి తగ్గ పారితోషికం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆశ వర్కర్ల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం గత అనేక రోజుల నుంచి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాజు, సునీత, దేవమ్మ, మంజుల, శ్యామల పాల్గొన్నారు.

చౌకధర దుకాణాల తనిఖీ

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మామిడిమాడలోని చౌకధర దుకాణాన్ని శుక్రవారం తహసీల్దార్ సుగుణ తనిఖీ చేశారు. రేషన్ కార్డు లబ్ధిదారులకు అందిస్తున్న సన్న బియ్యం నాణ్యతను రికార్డులను పరిశీలించి చౌకధర దుకాణం డీలర్‌కు సూచనలు చేశారు. తిరుపతయ్య పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల

వనపర్తి టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉపప్రధాన మంత్రి డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహించాలని మహనీయుల ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు గంధం గట్టయ్య మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో మహనీయుల ఉత్సవ కమిటీ సభ్యులు జగ్జీవన్‌రామ్ జయంతి కరపత్రాలను విడుదల చేశారు. భోజరాజు, కృష్ణపాల్గొన్నారు.

తల్లిపై కుమారుడి దాడి

పాన్‌గల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చింతకుంటకి చెందిన ఆవుల బాలమ్మ కుమారుడు ఆంజనేయులు కుటుంబ విషయంలో మనస్పర్థలతో చిన్న గొడవలు చోటుచేసుకుంటున్నాయి. ఆదివారం తాగునీటి నల్లా వద్ద ఆవుల బాలమ్మ నీళ్లు పడుతుండగా... కోడలు అనిత, బాలమ్మలు గొడవ పడ్డారు. దీంతో ఇంట్లో ఉన్న కుమారుడు రాడుతో తల్లి తలపై బలంగా దాడి చేశాడు. కొడుకు, కోడలిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదు చేసింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'వక్ఫ్ బోర్డు బిల్లును ఉపసంహరించుకోవాలి'

అమరచింత, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంటులో వక్ఫ్ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ పేర్కొన్నారు. శుక్రవారం అమరచింతలో విలేకరులతో మాట్లాడారు. ఏఐవైఎఫ్ నాయకులు షైబు, మల్లేష్ పాల్గొన్నారు.

భయంగా బడి చదువులు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

వనపర్తి రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి మండల పరిధిలోని దత్తాయిపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు భయం భయంతో బడి చదువులు చదువుతున్నారు. ఆ పాఠశాలలో 1వ తరగతి నుంచి 4వ తరగతి వరకు 32 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. ఆ పాఠశాలకు మూడు గదులు ఉండగా అందులో ఒక గదిశిథిలావస్థకు చేరింది. మరొక గది అంగన్‌వాడీ సెంటర్‌కు కేటాయించగా... ఉన్న ఒకే గదిలో విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థులు ఒకే గది సరిపోకపోవడంతో శిథిలావస్థలోని గది వరండాలో కూర్చోబెట్టి చదివిస్తున్నారు. కానీ ఆ గది శిథిలావస్థలోకి చేరి పైకప్పు నుంచి పెచ్చులూడి కింద పడిపోతుంది. గతంలో ఎన్నోసార్లు విద్యార్థులు చదువుకుంటున్న సమయంలో పెచ్చులూడి కింద పడ్డాయి. సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థ గది, వరండాను నిర్మాణ పనులు చేపట్టి, అంగన్‌వాడీ సెంట ర్‌కు కేటాయించిన గదిని పాఠశాలకు అప్పజెప్పేలా చూడాలని ఉపాధ్యాయ బృందం బాలరాజు మనోహర్ గౌడ్ కోరారు.



వరండాలో చదువుకుంటున్న విద్యార్థులు, పెచ్చులూడుతున్న గది పైకప్పు ఇలా..

రేషన్ దుకాణాలకు సన్న బియ్యం వేగంగా చేర్చాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా , ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాలకు సన్న బియ్యం రవాణా పంపిణీని వేగవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. శుక్రవారం హైదరాబాద్ సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్నబియ్యం సరఫరాపై అన్ని జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కా న్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. జిల్లాలోని అన్ని రేషన్ దుకాణాలకు వేగంగా సన్న బియ్యం పంపిణీ చేయాలని పేర్కొన్నారు. సన్న బియ్యం రవాణాను నూతన ఆహార భద్రత కార్డుల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు, పౌర సరఫరాల డీఎం జగన్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు : ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం పెబ్బేరులోని ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎంపికైన లబ్ధిదారులు వేగంగా గ్రౌండ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

పెబ్బేరు రూరల్ : రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం సేకరణ చేపట్టాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. శుక్రవారం మండలంలోని కంచిరావుపల్లిలోని రైతు వేదికల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవడానికి వచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు.

రేపు సీతారాముల కల్యాణం

గోపాల్‌పేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఆదివారం జరగబోయే సీతారాముల కల్యాణానికి అందరూ ఆహ్వానితులే అని కోదండరామస్వామి ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు సీతారాముల కల్యాణం మండల కేంద్రంలో కోదండ రామస్వామి ఆలయంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.

న్యాయవాదుల సంఘం అధ్యక్షుడికి సన్మానం

వనపర్తిలీగల్ కంట్రీబ్యూటర్ ఏప్రిల్ 4, (ఆంధ్రజ్యోతి) : వనపర్తి న్యాయవాదుల సంఘానికి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన డి.కిరణ్‌కుమార్, కోశాధికారి గుర్రం రాజుగౌడ్, కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్‌లను బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాచాల యుగందర్‌గౌడ్, ఆయన మిత్ర బృందం వనపర్తిలో శుక్రవారం జిల్లా కోర్టులో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తిరుపతయ్యయాదవ్, దేవర, శివ, వీవీ గౌడ్, బత్తుల జితేందర్, అంజన్నయాదవ్, రాఘవేందర్‌గౌడ్, గౌతమ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ బాధ్యతగా భావించాలి

ఆత్మకూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : నర్సరీ ప్లాంట్‌లో మొక్కల సంరక్షణ బాధ్యతగా భావించి మొక్కలు ఎండిపోకుండా నీటిని అందించాలని ఆత్మకూరు ఎంపీడీవో శ్రీపాదు పేర్కొన్నారు. ఆత్మకూరు మండల పరిధిలోని జూరాలలో ఏర్పాటు చేసిన నర్సరీ ప్లాంటును మండల పంచాయతీ అధికారి శ్రీరామ్ రెడ్డితో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. దాసు, ఫీల్డ్ అసిస్టెంట్ గోపాల్ పాల్గొన్నారు.

కెనాల్ భూ సేకరణ స్థలంలో అక్రమ నిర్మాణం పరిశీలన

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సల్కెలాపూర్‌లో కెనాల్ నిర్మాణానికి భూ సేకరణ చేసిన స్థలంలో అక్రమంగా చేపడుతున్న కంపౌండ్ వాల్ నిర్మాణాన్ని శుక్రవారం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. భూ పరిహారం పొందిన అనంతరం సుమారు ఎకరం భూమిని కబ్జా చేస్తు కంపౌండ్ వాల్ నిర్మిస్తున్నారని ఫిర్యాదు రావడంతో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్నట్లు చెప్పారు. కెనాల్ భూ సేకరణ అధికారులు, పైఅధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వనపర్తి రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణ కేంద్రంలోని ఏకో పార్కులో వనపర్తి జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో వన దర్శిని అనే కార్యక్రమంలో భాగంగా వనపర్తి జిల్లా ఎఫ్ఆర్‌వో నిఖిల్ రెడ్డి ఆదేశానుసారం డిప్యూటీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ రజినీకాంత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం పర్యావరణ విద్య ప్రకృతిపై చిత్రలేఖనం నిర్వహించారు. వనపర్తి మండల పరిధిలోని చిట్యాల రాజపేటలోని ప్రభుత్వ పాఠశాల 6, 7వ తరగతి విద్యార్థులను తీసుకెళ్లి నాటిన మొక్కలు, నూతనంగా విస్తరిస్తున్న అడవిపై అవగాహన కల్పించారు. ఏకో పార్కులోని అందమైన వన దృశ్యాలను చూపించారు. అలాగే ఏకో పార్కులోని బుద్ధ ధ్యాన మందిరంలో సుమారు 120 మంది విద్యార్థులతో వారు పర్యావరణ విద్యపై, ప్రకృతిపై చిత్రలేఖన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు.

17 శాతం తేమ ఉన్న ధాన్యం కొనుగోలు



వరి కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఏవో గోవిందు నాయక్

వీపనగండ్ల, ఏప్రిల్ 4, (ఆంధ్రజ్యోతి) : రబీలో 14 నుంచి 17 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేస్తామని డీఏఓ గోవిందు నాయక్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ధాన్యం కొనుగోళ్లపై వ్యవసాయ, సహకార సివిల్ సప్లయ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నాణ్యమైన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. కొనుగోలులో పాటించాల్సిన నియమ నిబంధనలను గురించి రైతులకు తెలిపారు. తాలు, చెత్త ఒక శాతానికి మించకూడదన్నారు. రంగు మారిన గింజలు 5 శాతానికి మించకూడదని పూర్తిగా తయారు కాని గింజలు 3 శాతం కంటే తక్కువగా ఉండాలని తెలిపారు. దొడ్డు, సన్న రకం ధాన్యం కొనుగోలును ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. డాకేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

అకాల వర్షానికి తడిసిన వరి ధాన్యం



కొత్తకోటలో వర్షానికి కొట్టుకుపోయిన వరి ధాన్యం

కొత్తకోట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షం రైతాంగాన్ని అతలాకుతలం చేస్తుంది. గురువారం రాత్రి కురిసిన 15 మిల్లీమీటర్ల అకాల వర్షానికి వరి ధాన్యం తడిసి పోయింది. యాసంగి సీజన్‌లో ముందుగా నాటు వేసిన వరి పంటల కోతలు ప్రారంభమయ్యాయి. కోతలు కోసి అమ్మకానికి సిద్ధం చేయడంలో భాగంగా ధాన్యాన్ని రోడ్లపై అరబెట్టుకుంటుండగా మళ్లీ అకాల వర్షం కురిసింది. పగలంతా ఎండ కాసి రాత్రి తొమ్మిది గంటల తర్వాత వాతావరణంలో మార్పులు చోటు చేసుకొని ఒక్కసారిగా వర్షం కురవడంతో రైతులు ఏమి చేయాలో అర్థం కాక లోబోదిబోమంటూ ధాన్యం కుప్పలపై కవర్లు కప్పారు. అప్పటికే తడవాల్సినంత తడిసిపోవడంతో పాటు వర్షపు నీటికి ధాన్యం కొట్టుకుపోయింది.

19.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

వీపనగండ్ల : గురువారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలో 19.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యింది. గాలి లేకుండా పదును పెట్టు వర్షం కురవడం కొంత మంది రైతుల మామిడి పంటలకు మాత్రమే మేలు జరిగింది.

కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం పనులు చేపట్టాలి

వనపర్తి రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయానికి వెంటనే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను కోరారు. శుక్రవారం వనపర్తి మండల పరిధిలోని రాజపేట గ్రామ శివారులో 73 సర్వే నెంబరులోని స్థలాన్ని ఎమ్మెల్యే మేఘారెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి స్థలం చాలా అనుకూలంగా ఉందని వెంటనే పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి సూచించారు. పార్టీ కార్యాలయ నిర్మాణంతో కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలకు ఎంతగానో అణువుగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, పట్టణ నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం అందించిన తొలి ప్రభుత్వం కాంగ్రెస్



కొత్తకోట మండల కానాయపల్లిలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు

గోపాల్‌పేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని రేషన్ దారులకు సన్న బియ్యం అందించిన తొలి ప్రభుత్వం కాంగ్రెస్ అని మండల జనరల్ సెక్రటరీ జిల్లెల ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని మున్నూరులో రేషన్ లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ రెడ్డి మాట్లాడారు. చంద్రశేఖర్ రెడ్డి, లోకేశ్వర్ రెడ్డి, బాలీశ్వర్, అంజి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట : మండలంలోని కానాయపల్లి, వడ్డెవాట, చర్లపల్లి, మిరాసిపల్లి, రామకృష్ణాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాలను శుక్రవారం ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ చైర్మన్ ప్రశాంత్ పార్టీ మండల అధ్యక్షుడు బీచుపల్లి యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, గోకరయ్య, సంజీవులు, సాయిరెడ్డి, శివరాములు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రేవల్లి : ఇందిరమ్మ రాజ్యంలో ప్రతీ ఇంటికి సన్న బియ్యం అందుతాయని రేవల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వాడల పర్వతాలు అన్నారు. శుక్రవారం రేవల్లి మండల కేంద్రంలో రేషన్ షాపుల వద్ద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేశారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ ఫలాలు

అమరచింత : అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. శుక్రవారం అమరచింత మండలం చంద్రఘడ్‌లో రాష్ట్ర కాంగ్రెస్ కల్లు విభాగం చైర్మన్ నాగరాజు గౌడ్, తహసీల్దార్ రవికుమార్ తో కలిసి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి బడుగు బలహీన వర్గాలతో పాటు మారుమూల ప్రాంతాల్లోని ప్రతీ ఒక్కరి సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని అన్నారు. అయుబ్‌ఖాన్, కాంగ్రెస్ మండల పట్టణ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, అరుణ్ కుమార్, చంద్రఘడ్ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానివ్వను



బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

గోపాల్‌పేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి సాగునీటి సమస్య రానివ్వనని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో హనుమాన్లగడ్డ, రాంనగర్ కాలనీలో మంచినీళ్ల బోరును ఏర్పాటు చేసి బోరు మోటార్‌ను ప్రారంభించి మాట్లాడారు. మండలంలో తాగునీటి సమస్యను రానివ్వనని, ఏమైనా తాగు, సాగునీటి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని స్థానిక నాయకులకు సూచించారు. సత్య శిలారెడ్డి, శివన్న, నాగశేషి ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ తప్పదు

వనపర్తి టౌన్ : ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ ఎప్పటికైనా తప్పదని, పదవీ విరమణ అనంతరం వారి అనుభవాలను ప్రజా సేవకు అంకితమయ్యేలా చూడాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న శివారెడ్డి శుక్రవారం పదవీ విరమణ చేశారు. కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.

దేశానికే ఆదర్శంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ పాలన



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

ఆత్మకూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : దేశానికే ఆదర్శంగా నిలిచేలా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలన సాగిస్తుందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఆత్మకూరు మండలంలో శుక్రవారం ఆయన పర్యటించి చౌకధర దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ, ధాన్యం కొనుగోలు కేంద్రం, అష్టలక్ష్మి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన వంటి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ సుభిక్ష పాలన అందజేస్తుందని తెలిపారు. సన్న బియ్యం పంపిణీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాగరాజు గౌడ్, రాయచూర్ పరమేష్ శ్రీనివాసులు, రహమతుల్లా, తులసిరాజ్, కృష్ణమూర్తి, వినయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

చదువుతో పాటు సంస్కారం

ఆత్మకూరు : చదువుతో పాటు విద్యార్థుల సంస్కారం అలవర్చుకుంటేనే భవిష్యత్ కాలంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని విశ్వ భారతి ప్రైవేటు పాఠశాల 30వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు కూడా చిన్నారులపై బాధ్యత వహించి సంస్కారం నేర్పేలా కృషి చేయాలన్నారు.

ఫిల్టర్ ఇసుక తయారీపై అధికారుల ఆగ్రహం



ఇసుకను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుగుణ

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మామిడిమాడలో ఫిల్టర్ ఇసుక తయారీపై తహసీల్దార్ సుగుణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఫిల్టర్ ఇసుక తయారు చేసే నేరేడు చెరువులోని ప్రాంతాన్ని డబుల్ బెడ్రూం వద్ద ఫిల్టర్ ఇసుక డంపులను శుక్రవారం తహసీల్దార్ సుగుణ, పంచాయతీ రాజ్ ఏఈ రమేష్ నాయుడు పరిశీలించారు. డబుల్ బెడ్రూం వద్ద ఇళ్ల నిర్మాణం ఫిల్టర్ ఇసుకతో చేపట్టడంతో నాణ్యత ప్రమాణాలు లోపిస్తాయని అన్నారు. ఇసుకను నీటితో కడిగి ఫిల్టర్ ఇసుకగా నిర్ధారించారు. ఫిల్టర్ ఇసుక తయారీపై విచారణ చేసి గుర్తించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సుగుణ తెలిపారు.

విజ్ఞానశాస్త్ర ప్రదర్శనతో విద్యార్థుల్లో ప్రేరణ



విద్యార్థుల సాధనను పరిశీలిస్తున్న ఎంఈవో

పెబ్బేరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన విద్యార్థుల్లో ప్రేరణ కల్పిస్తుందని ఎంఈవో జయరాములు అన్నారు. శుక్రవారం కృష్ణవేణి పాఠశాలలో ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తాము చేసిన పనులను ఇతరులతో పంచుకోవడంతో ఆ భావాలపైన అవగాహన పెరుగుతుందని తెలిపారు. విజ్ఞాన శాస్త్ర పరిశోధనలో దీర్ఘకాలిక వ్యాధులు బీపీ, డయాబెటిస్, కిడ్నీ వ్యాధులు 40 రకాల సాధనలు, నమూనాలను ఆకర్షణీయంగా ప్రదర్శించారని కొనియాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాఘవేంద్ర గౌడ్, ఉపాధ్యాయ బృందం కాశీ విశ్వనాథ్, సురేష్, రవి, రామకృష్ణ, హరీష్, అనిల్, తిరుమలేష్ పాల్గొన్నారు.

బీజేపీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు రాజేందర్ రెడ్డి

వనపర్తి అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 6వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరిగే బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలతో పాటు ఈ నెల 14 నుంచి 25 వరకు జరిగే అంబేద్కర్‌జయంతి ఉత్సవాల నిర్వహణ వేడుకలను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు సీహెచ్ రాజేందర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్లో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను బరిలో నిలబెట్టడంతో పాటు గెలిపించే విధంగా పని చేయాలని పిలుపునిచ్చారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న అబ్దుల్ ఘని

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బడిలో విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని తెలిపారు. మండలంలోని మల్కిమియాన్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం పాఠశాల రికార్డులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. విద్యార్థుల్లో పఠన సామర్థ్యాలను పెంచి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి జయశంకర్, సునీత, రవి శంకర్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



వనపర్తిలో సీటు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం, కొత్తతండాలో...

వనపర్తి రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి మండల పరిధిలోని పెద్దగూడెంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శుక్రవారం ఐదో తరగతి గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చాటారు. అక్షర సహస్ర ట్రైబల్ వెల్ఫేర్ వనపర్తి, భాను ప్రసాద్ సోషల్ వెల్ఫేర్ దేవరకద్ర, మౌనిక సోషల్ వెల్ఫేర్ పెద్దమందడి, యశ్వంత్ ట్రైబల్ వెల్ఫేర్ పెద్దమందడి, ఎండి నిషాన్ బీసీ వెల్ఫేర్ కడుకుంట్ల నాగవరంలో సీటు సాధించారు. దీంతో ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

శ్రీరంగాపూర్ : మండల కేంద్రంలోని ప్రగతి విద్యాలయంలో చదువుతున్న అంబేడ్కర్ కాలనీకి చెందిన విద్యార్థిని ఉమాదేవి ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి మహబూబ్‌నగర్ జిల్లా రాంరెడ్డి గూడలో సీటు సాధించింది. అదే విధంగా మండల కేంద్రానికి చెందిన తరుణ్ తేజ్ కల్వకుర్తి జేపీ నగర్‌లో సీటు సాధించారు.

రేవల్లి : మండలంలో వివిధ పాఠశాలల నుంచి 17 మంది విద్యార్థులు ఎంపికైనట్లు మండల విద్యాధికారి బాల్‌రెడ్డి తెలిపారు. కొత్తతండాలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నలుగురిలో ముగ్గురు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ రామమూర్తి తెలిపారు.



ఉమాదేవి



తరుణ్ తేజ్